# లీడర్లను కొనొచ్చు.. ప్రజలను కొనలేరు

- 55 ఏండ్ల పాలనలో హస్తం పార్టీ చేసింది శూన్యం
- ఓటుకు నోటు కేసులో దొంగ రేవంత్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ సర్పంచులను డబ్బులతో కొనేందుకు ప్రయత్నం
- నీతిమాలిన రాజకీయాలు చేస్తే ప్రజలు క్షమించరు
- నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే ప్రమోషన్
- ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్
- అట్టహాసంగా కొడంగల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామినేషన్


మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, పక్కన ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మంత్రి మహేందర్‌రెడ్డి

కొడంగల్, నవంబరు 9 : ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని రెండోసారి గెలిపిస్తే కేసీఆర్ కాళ్లు మొక్కైనా సరే ప్రమోషన్ ఇప్పించే బాధ్యత తీసుకొంటానని మంత్రి కేటీఆర్ అన్నారు. గురువారం కొడంగల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డికి మద్దతుగా కొడంగల్ పట్టణంలో రోడ్ షో, పబ్లిక్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిదిన్నరేండ్లలో తెలంగాణ రాష్ట్రం అన్నింటా అభివృద్ధితో దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. పేదలను కడుపులో పెట్టుకొని సీఎం కేసీఆర్ కాపాడుతున్నట్లు పేర్కొన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ను గెలిపించుకున్నందుకు కన్నడ ప్రజలు నేడు చెంపలేసుకొంటున్నారని, తెలంగాణ బిడ్డలు ఆ తప్పు చేయొద్దని కోరారు. ఓటుకు నోటుతో అడ్డంగా దొరికిపోయి కొడంగల్ పరువును జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రేవంత్ తీశాడన్నారు. 20 ఏండ్ల కిందట రేవంత్‌రెడ్డి సున్నాలు వేసుకొని బతికేవాడని, బ్లాక్‌మెయిల్, బ్రోకర్, సెటిల్‌మెంట్ దందాలతో కోట్లు సంపాదించినట్లు ఆరోపించారు. పీసీసీ పదవిని కొనుక్కొని, కాంగ్రెస్ టికెట్లను అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నాడని మండిపడ్డారు. అవే డబ్బులను నేడు కొడంగల్ నియోజకవర్గంలో సర్పంచులు, ఎంపీటీసీలను కొంటున్నట్లు తెలిపారు. సర్పంచులను కొనుగోలు చేసే రేవంత్ ప్రయత్నాన్ని గిరిజన సర్పంచ్ తిప్పికొట్టారని, గిరిజనులు అమ్ముడుపోయే వారు కారని బొంరాస్‌పట్ సర్పంచ్ నర్సింగ్‌నాయక్ నిరూపించినట్లు చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో కొడంగల్‌లో లక్షా 25వేల ఎకరాల సాగు నీరందనున్నట్లు తెలిపారు. త్వరలోనే కొడంగల్‌కు పాలమూరు-రంగారెడ్డి నీళ్లు వస్తాయన్నారు. కొడంగల్‌లో బీటీ రోడ్లు, డిగ్రీ, జూనియర్ కళాశాలలు, 50, 30 పడకల దవాఖానలు, రెండు మున్సిపాలిటీలు, మూడు కొత్త మండలాలు వంటి ఎన్నో సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. కొడంగల్‌లో అభివృద్ధి చేసిన దాఖలాలు లేకపోవడంతో ప్రజలు ఎక్కడ నిలదీస్తారనే భయంతో రాత్రుల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. రేవంత్‌రెడ్డి పాపపు సంపాదన ఎంత ఇస్తే అంత తీసుకొని కారు గుర్తుకు ఓటేసి అభివృద్ధిని ఆశీర్వదించాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వం ఏనాడూ కులం, మతం పేరుతో పంచాయతీలు చేపట్టలేదని, అన్నివర్గాల వారికి సమన్యాయాన్ని అందిస్తూ ప్రతివర్గం అభ్యున్నతికి ప్రత్యేకంగా సంక్షేమ పథకాలను అందించి ఆదరిస్తున్నట్లు తెలిపారు. నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే.. కొడంగల్ నియోజవర్గంలో మద్దూర్ మండలాన్ని మున్సిపాలిటీగా, నియోకవర్గంలో ఒక రెవెన్యూ డివిజన్, ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల, 100 ఎకరాల్లో ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు వెల్లడించారు. రైతుబంధు కావాలా.. రాబంధులు కావాలా..? ప్రజల మధ్యన ఉండే నాయకుడు కావాలా..? చేతులూపే నాయకుడు కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు.

**హ్యాట్రిక్ గెలుపు ఖాయం..**

ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ భారీ మెజార్టీతో ప్రభంజనాన్ని సృష్టించనున్నదని, ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆర్ విజయం సాధించడం ఖాయమని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. మంత్రి కేటీఆర్ కొడంగల్‌ను దత్తత తీసుకున్న తర్వాత కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయడంతో అభివృద్ధి సాధ్యపడిందన్నారు. గతంలో రేవంత్‌రెడ్డిని రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిపించుకున్నప్పటికీ కొడంగల్ ప్రజలకు ఎటువంటి మేలు చేయలేదన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాతే సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధిని సాధించిందని, నేడు దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. రానున్న రోజుల్లో మూడో సారి మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి రానున్నదని, కాంగ్రెస్ కల్లబొల్లి మాటలను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు.

## రూ.950కోట్లతో అభివృద్ధి : ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

2018కి ముందుకు కొడంగల్ ఎటువంటి అభివృద్ధిని నోచుకోలేదని, సీఎం కేసీఆర్ హయాంలోనే కొడంగల్ అభివృద్ధికి రూ.960కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో కొత్తగా 47తండాలు గ్రామ పంచాయతీలుగా ఏర్పడ్డాయన్నారు. ప్రతి తండాలో బీటీ రోడ్లు, తాగునీరు వంటి సదుపాయాలు ఏర్పడటంతో కేసీఆర్‌ను దేవుడిలా కొలుస్తున్నట్లు తెలిపారు. గతంలో రేవంత్‌రెడ్డి ఎటువంటి అభివృద్ధిని చేపట్టకపోగా, నేటి అభివృద్ధి ఆయన కండ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కొడంగల్‌లో తిరిగితే మేం చేసిన అభివృద్ధి తెలిసేదన్నారు. సంవత్సరానికి రెండుసార్లు వచ్చేవారికి ప్రజల గురించి ఏం తెలుస్తుందన్నారు. ఓటమి భయంతో గుర్నాథ్‌రెడ్డిని ఆశ్రయించాడని, గతంలో గుర్నాథ్‌రెడ్డిని బొందపెడతా, కోట గోడలను కూలుసాన్తని చెప్పడం జరిగిందన్నారు. మరో మారు ఆశీర్వదిస్తే కొడంగల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలో ఇండస్ట్రీ ఏర్పాటు చేసేందుకు గాను ఇప్పటికే 100 ఎకరాల స్థలాన్ని సేకరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. మంత్రి కేటీఆర్ రోడ్ షో కార్యక్రమం భారీ జన సందోహం మధ్య కొనసాగింది. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావడంతో కొడంగల్ నియోజకవర్గంలో అంబేద్కర్ కూడలి కిక్కిరిసిపోయింది. పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ చేరుకున్న మంత్రికి అక్కడి నుంచి అంబేద్కర్ కూడలి వరకు భారీ ర్యాలీతో చేరుకున్నారు. గ్రామల నుంచి జనాలు ప్రత్యేక వాహనాల్లో, బైక్‌లపై రోడ్ షోకు చేరున్నారు. మంత్రి రోడ్ షోతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది.

# బీఆర్‌ఎస్‌తోనే భరోసా


జిల్లా కేంద్రంలో మంత్రి నామినేషన్‌కు భారీగా హాజరైన జనం


తల్లిదండ్రుల సమాధి వద్ద పూజలు చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే నష్టపోతాం
- ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- సర్వమత పూజలతో నామినేషన్ దాఖలు
- గులాబీమయంగా మారిన పాలమూరు

మహబూబ్‌నగర్, నవంబర్ 9 : మహబూబ్‌నగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జనసందోహం మధ్య గురువారం నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం నుంచి న్యూటౌన్, మెట్టుగడ్డ, రైల్వేస్టేషన్ చౌరస్తాతోపాటు ప్రధాన రోడ్డు గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ సమీపంలోని మంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి కుటుంబ సభ్యులతో కలిసి నామినేషన్ పత్రంతో బయలుదేరారు. అర్చకుల వేదమంత్రాలతో మంత్రి సతిమణి శారద, కుటుంబ సభ్యులతో కలిసి ఆయన తల్లిదండ్రుల చిత్రపటాల వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం తల్లిదండ్రులు శాంతమ్మ, నారాయణగౌడ్ సమాదుల వద్ద ఆశీర్వాదం తీసుకుకున్నారు. అనంతరం ఎంబీసీ చర్చిలో రెవరన్ వరప్రసాద్‌తో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యకర్తలతో కలిసి మంత్రి ప్రత్యేకంగా డాన్స్ చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని రేణుక ఎల్లమ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ షాషాబ్‌గుట్ట దర్గా పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ రజాక్‌షాఖాద్రీని కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పార్టీ కార్యాలయానికి చేరుకొని వేలాది మంది బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి టీకప్ చౌరస్తా నుంచి బస్టాండ్ మీదుగా నామినేషన్ వేసేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ నేత సయ్యద్ ఇబ్రహీం, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాదీ, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులుతో కలిసి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి అనీల్‌కుమార్‌కు అందజేశారు.

**సేవకుడిలా పనిచేస్తా..**

ప్రజలకు మంచి చేయాలన్న తపన కాంగ్రెస్, బీజేపోళ్లకు లేదని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కులమతాలకు అతీతంగా అన్నివర్గాల సంక్షేమానికి బీఆర్‌ఎస్ కృషి చేస్తున్నదన్నారు. రైతులకు మంచి చేయాలనే తపన ప్రతిక్షణం సీఎం కేసీఆర్‌కు ఉందని, మహబూబ్‌నగర్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతిపక్షాలు దిమ్మతిరిగేలా లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. పదేండ్లలో ఊహించని అభివృద్ధి చేశామన్నారు. మహబూబ్‌నగర్‌లో వెయ్యి పడకల సూపర్‌స్పెషాలిటీ దవాఖాన, ఐటీ పార్కు, 26 ఎకరాల్లో జంగల్ సఫారీ పార్కు, 2,087 ఎకరాల్లో కేసీఆర్ ఎకో పార్కు, బైపాస్ రోడ్డు, మినీ ట్యాంక్‌బండ్ ఇలా చెప్పుకుంటేపోతే అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ జాబేర్ బిన్ సయ్యద్, ఎంఐఎం యువత అధ్యక్షుడు జాకీర్ అడ్వకేట్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేశ్ తదితరులున్నారు.

## నామినేషన్ల జాతర

మహబూబ్‌నగర్, నవంబర్ 9 : అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం సమయం దగ్గరపడుతుండడంతో అభ్యర్థులలో అలజడి ఊపందుకున్నది. గురువారం మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి సంబంధించి 11 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జడ్చర్లలో లక్ష్మారెడ్డి, దేవరకద్రలో ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మక్తల్ చిట్టెం రామ్మోహన్‌రెడ్డి బీఆర్‌ఎస్ తరపున నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ నుంచి శ్రీహరి, బీఎస్పీ వర్కటం జనార్దన్‌రెడ్డి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి నామినేషన్లను దాఖలు చేశారు. వనపర్తికి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. బీఎస్పీ నుంచి చిన్న రాములు, ప్రజాఏక్త పార్టీ నుంచి కమ్మరి సూర్యప్రకాశ్, అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ నుంచి కుందేళ్ల అర్జున్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా ఉమేశ్‌గౌడ్‌తోపాటు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నారాయణపేట నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎస్.రాజేందర్‌రెడ్డి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. బీజేపీ నుంచి రతంగ్‌పాండు రెడ్డి, కాంగ్రెస్ నుంచి పర్నికరెడ్డి, బీఎస్పీ నుంచి బోదిగల శ్రీనివాస్, తెలుగు కాంగ్రెస్ నుంచి సంజీవ్‌రెడ్డి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ నుంచి బీరం విజయ తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందించారు. గద్వాల నియోజకవర్గం నుంచి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బండ్ల జ్యోతి బీఆర్‌ఎస్ నుంచి తమ నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారికి అందజేశారు. కల్వకుర్తిలో బీజేపీ నుంచి తల్లోజు ఆచారి, స్వతంత్ర్య అభ్యర్థులతోపాటు పలు పార్టీల నుంచి తమ నామినేషన్లను సంబంధింత అధికారులకు అందజేశారు. అలంపూర్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడు, అచ్చంపేట నియోజకవర్గం నుంచి గువ్వల అమల బీఆర్‌ఎస్ నుంచి తమ నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 90 నామినేషన్లు దాఖలయ్యాయి.

SVS హాస్పిటల్ మహబూబ్‌నగర్
ఎముకల సాంద్రత స్కాన్
Whole Body Bone Density Scan
SVS హాస్పిటల్‌లో బోన్ డెన్సిటీ (DEXA) Whole Body Scan అందుబాటులో కలదు. ఎముకల లోని కాల్షియం మరియు సంబంధిత ఎముక ఖనిజాలను (Density) కొలుస్తూ తుంటి, వెన్నుముక, ముంజేయి మరియు మొత్తం ఎముకల సాంద్రత స్కాన్ చేయబడును. ఈ స్కాన్ ద్వారా ఆస్టియోపొరోసిస్, ఆస్టియోపీనియ వ్యాధి లక్షణాలను ముందే గుర్తించబడును, అత్యాధునిక 16 Channel, High Resolution తో కూడిన (DEXA) Whole Body Scan యంత్రం.
ఈ క్రింద తెలుపబడిన రేటు వర్తించును.
Whole Body Bone Density Scan - Rs.1500/-
వివరాలకు ఈ మొబైల్ 7893888529 / 6303444232 నెంబర్ల పై సంప్రదించగలరు.
Dept Of Orthopaedics
SVS Medical College Hospital